





త్వరలోనే అరెస్టు చేస్తాం

- బండ్ల రాజశేఖర్‌రెడ్డి ఆచూకీ కోసం ఆరు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి
- విలేకరుల సమావేశంలో డీఎస్పీ సత్యనారాయణ

గద్వాల క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్‌రెడ్డిని త్వరలోనే అరెస్టు చేస్తామని డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఆయన పట్టణంలోని సీఐ కార్యాలయంలో బండ్ల రాజశేఖర్‌రెడ్డి సోదరుడైన చంద్రశేఖర్‌రెడ్డిని విచారించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాజశేఖర్‌రెడ్డి ఇంట్లో పనిచేసే బాలిక రాజేశ్వరిపై దొంగతనం మోపడంతో మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కర్నూల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 24న మృతి చెందింది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించే దిశగా ముందు కెళ్తున్నామని డీఎస్పీ తెలిపారు. బండ్ల రాజశేఖర్‌రెడ్డి ఎక్కడ ఉన్నారు. మీకు ఎప్పుడు కలిశారు. అయనకు సంబంధించిన కాల్ డాటా వివరాలపై ఆయన సోదరుడిని ఆరా తీసినట్లు తెలిపారు. మంగళవారం రాత్రి కూడా ఇదే కోణంలో విచారించామని చెప్పారు. రాజశేఖర్‌రెడ్డిని పట్టుకునేందుకు ఆరు బృందాలు ప్రయత్నిస్తున్నాయని, త్వరలోనే తప్పకుండా ఆయనను పట్టుకుంటామన్నారు. ఎలాంటి అపోహలకు తావులేదన్నారు. ఈ సమావేశంలో సీఐ టంగుటూరి శ్రీను ఉన్నారు.







ప్రణాళికాబద్ధంగా విద్యార్థుల డేటా సేకరించాలి

- జిల్లా సమన్వయ అధికారి శాంతిరాజు

వడ్డేపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థుల పూర్తి డేటాను ప్రణాళికాబద్ధంగా సేకరించి, వివరాలు నమోదు చేయాలని జిల్లా సమన్వయ అధికారి శాంతిరాజు సూచించారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో బుధవారం జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ సంవత్సరం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు పూర్తి చేసిన విద్యార్థుల వివరాల నమోదు, నవీకరణలకు సంబంధించిన సమాచారాన్ని ఆపరేటర్ల నుంచి సేకరించామన్నారు. అలాగే ప్రతీ పాఠశాలకు సంబంధించిన గణాంకాలు, కొత్త ఎన్‌రోల్‌మెంట్‌లు, అప్‌డేషన్‌లు, జనన ధ్రువీకరణ పత్రం అందుబాటులో లేని కారణంగా ఆధార్ తీయని విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. ఆపరేటర్లు మండలాలలోని పాఠశాలలకు చెందిన విద్యార్థుల వందశాతం ఆధార్ అప్‌డేషన్ పూర్తి చేయాలన్నారు. అనంతరం మండల విద్యాధికారి నరసింహ మాట్లాడుతూ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, అప్‌డేషన్‌లకు సంబంధించిన సమస్యలను వివరించారు. జిల్లా టెక్నికల్ అధికారి శివకృష్ణ, ఎస్ఎస్ఆర్ జిల్లా కో ఆర్డినేటర్ చాంద్‌బాషా పాల్గొన్నారు.

ఉన్న ఊరిలో ఉపాధి లేక.. నడిగడ్డకు వలస

- పత్తితీత పనుల కోసం వస్తున్న కూలీలు
- ఏపీ, కర్ణాటకల నుంచి ఎక్కువ మంది రాక

7





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

ధాన్యం కొనుగోళ్లకు.. గ్యారెంటీ ఇవ్వాల్సిందే

- రైస్ మిల్లర్ల సమావేశంలో కలెక్టర్ బీ.ఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రైస్ మిల్లర్లు ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేయాలంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం కచ్చితంగా బ్యాంకు గ్యారెంటీ లేదా సెక్యూరిటీ డిపాజిట్‌ను పౌర సరఫరా కార్పొరేషన్‌కు సమర్పించాల్సి ఉంటుందని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ధాన్యం కొనుగోలుపై మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేయాలంటే గ్యారెంటీ తప్పనిసరిగా ఉండాల్సిందేనన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం మిల్లర్లను నాలుగు రకాలుగా విభజించామని, అందులో గతంలో ఎలాంటి బకాయిలు లేని మిల్లర్లు 10 శాతం బ్యాంకు గ్యారెంటీ లేదా 25 శాతం సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. రెండో రకం మిల్లర్లు గత బకాయిలతో పాటు పెనాల్టీ ఉన్నవారు 20 శాతం బ్యాంకు గ్యారెంటీ 25 శాతం సెక్యూరిటీ డిపాజిట్ అందించాలన్నారు. మూడవ రకం మిల్లర్లు 100 శాతం బకాయిలు చెల్లించి 25 శాతం పెనాల్టీ పెండింగ్ ఉన్నవారు 25 శాతం బ్యాంకు గ్యారెంటీ లేదా సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే నాలుగో రకం మిల్లర్లు డిఫాల్టర్లుగా ఉన్న వారికి ధాన్యం కేటాయించబోమని కలెక్టర్ తెలిపారు. రైస్ మిల్లర్ల అసోసియేషన్ అభ్యర్థన మేరకు మిల్లర్లకు అదనపు మిల్లింగ్ చార్జీలు అందజేస్తామన్నారు. దొడ్డురకం ధాన్యానికి క్వింటాలుకు రూ.30, సన్న రకానికి రూ.40 చొప్పున అదనంగా మిల్లింగ్ చార్జీలు అందిస్తారని, మిల్లర్లకు కేటాయించగా మిగిలిన ధాన్యాన్ని ఇంటర్మీడియట్ గోదాములో భద్రపరచాలన్నారు. మిల్లర్లు సమస్యలు తలెత్తకుండా ధాన్యాన్ని సేకరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, డీఎస్‌వో స్వామికుమార్, పౌర సరఫరా జిల్లా మేనేజర్ విమల, రైస్ మిల్లర్లు ఉన్నారు.





గద్వాల మార్కెట్‌లో మామిడాకులు, బంతిపూలు, ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు


నేడు దీపావళి

- కొనుగోలు దారులతో కిటకిటలాడిన దుకాణాలు

గద్వాల టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల పాటు జరుపుకునే దీపావళిని పురస్కరించుకుని బుధవారం పట్టణంలో సందడి నెలకొన్నది. ఈ ఏడాది దీపావళి పండుగ గురువారం జరుపుకోవాలని కొందరు, సూర్యోదయం వేళ అమావాస్య తిథి శుక్రవారం ఉండటంతో అదేరోజు జరుపుకోవాలని మరికొందరు అంటున్నారు. ఏది ఏమైనా.. పండుగ సరకుల కొనుగోళ్లతో మార్కెట్‌లో సందడి వాతావరణం నెలకొన్నది. రైతులకు పంట చేతికందే సీజన్‌లో వచ్చే పెద్ద పండుగ దీపావళి కావడం, పితృదేవతల పేరుపై దీపావళి అమావాస్య రోజు ప్రత్యేక పూజలు చేయడం ఈ ప్రాంతంలో ఆనవాయితీగా వస్తోంది. దీంతో పండుగ సరకులు కొనే వారితో పట్టణంలోని దుకాణాలు కిటకిటలాడాయి. దీపావళి అమావాస్య మరుసటి రోజు పాడ్యమిరోజు వ్యాపారులు లక్ష్మీ, సరస్వతీ దేవతల పూజలు ఆచరించే సంప్రదాయం ఉండటంతో అంగళ్ల యజమానులు పూజలకు సిద్ధమవుతున్నారు. పట్టణంలోని తేరు మైదానంలో పటాకుల దుకాణాలు ఏర్పాటు చేశారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న ప్రమిదలు



విక్రయానికి ఉంచిన బంతిపూలు



తేరు మైదానంలో ఏర్పాటు చేసిన పటాకుల దుకాణాలు

ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రభు వినయ్ సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్

వనపర్తి క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రభు వినయ్‌ను సస్పెండ్ చేస్తూ ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొన్ని నెలలుగా ప్రభు వినయ్ ఎక్సైజ్ కార్యాలయానికి రాకుండా ఇంటి దగ్గర నుంచే విధులు నిర్వహిస్తున్నారని బీసీ పొలిటికల్ జేఏసీ ఛైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎక్సైజ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదుపై కొన్ని రోజులుగా విచారణ చేపట్టిన అధికారులు బుధవారం ప్రభు వినయ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభు వినయ్ జిల్లా అధికారిగా బాధ్యతలు చేపట్టినప్పటి నాటి నుంచి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల అండతో ఆడిందే ఆటగా విధులు నిర్వహిస్తూ వచ్చాడు. ఇటీవల వచ్చిన ఆరోపణలతో తన కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బందిని టార్గెట్ చేసి ఆర్డర్‌పై వచ్చిన ఉద్యోగులను తమ స్థానాలకు బదిలీ చేశాడు. సూపరింటెండెంట్ కార్యాలయంలో పని చేస్తున్న ఒక ఔట్ సోర్సింగ్ ఉద్యోగితో పాటు జూనియర్ అసిస్టెంట్ కూడా అవినీతికి పాల్పడుతూ కార్యాలయానికి వచ్చే వారిని వేధిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ విషయంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆడపడుచులకు కల్యాణలక్ష్మి ఓ వరం

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆడపడుచులకు కల్యాణ లక్ష్మి ఓ వరం అని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం గట్టు మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన 340 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసి, మాట్లాడారు. ఆడపడుచులకు ముందుగా దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. గట్టు మండలం ఎడారిగా ఉండేదని, తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ప్రతీ గ్రామంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ, కమిటీ హాళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో గట్టు మండలం అక్షరాస్యతలో వెనుకబడిన ప్రాంతంగా పిలుబడేదని, ఇప్పుడు అక్షరాస్యత పెరగడతో పాటు ఇక్కడి విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించేలా కృషి చేస్తానన్నారు. ఒకప్పుడు కరెంటు, నీటి సౌకర్యం లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారని, ప్రస్తుతం నీటి సౌకర్యంతో పాటు విద్యుత్ సౌకర్యాన్ని కల్పించేలా కృషి చేసానన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ హనుమంతు, నాయకులు బండారి భాస్కర్, జంబు రామన్‌గౌడు, గడ్డం కృష్ణారెడ్డి, రమేష్‌నాయుడు, అనంద్‌గౌడు, తిమ్మప్ప, వెంకటన్న గౌడు, అలి, మహేశ్వర్‌రెడ్డి, రమేష్‌నాయుడు ఉన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



జేఎన్‌టీయూ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. బుధవారం జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, డైరెక్టర్ అండ్ చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వర్‌రెడ్డి కలెక్టర్‌ను తన ఛాంబర్‌లో కలిసి పూల మొక్క అందించారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్న సమస్యలను రిజిస్ట్రార్ కలెక్టర్‌కు వివరించారు. కళాశాల అభివృద్ధికి రూ.100 కోట్లు పరిపాలన ఉత్తర్వులు మంజూరు అయినప్పటికీ నిధులు ఇంకా విడుదల కాలేదని తెలిపారు.

సరైన నిధులు లేక విద్యార్థులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించలేక పోతున్నామని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కలెక్టర్ ఫైల్ వివరాలు ఇవ్వాలని, నిధుల మంజూరుతో పాటు మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌వీఎస్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ రామ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కురుమూర్తి బ్రహ్మోత్సవాలపై కలెక్టర్ సమీక్ష



జాతర మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిరబోయి

చిన్నచింతకుంట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చిన్నచింతకుంట మండలం అమ్మపురం సమీపంలోని కురుమూర్తి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 31 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం జాతర మైదానంలో భక్తులకు చేస్తున్న ఏర్పాట్ల పురోగతిపై కలెక్టర్ విజయేందిర బోయి, అడిషనల్ కలెక్టర్ సివేంద్రి ప్రతాప్ పరిశీలించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు, ఆలయ చైర్మన్‌తో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. శానిటేషన్, విద్యుత్, టాయిలెట్స్‌లతో పాటుగా తాగునీటి పనులను సత్వరం పూర్తి చేయాలని చెప్పారు. వచ్చే నెల ఐదో తేదీ లోపు పనులు పూర్తయ్యేలా వేగవంతం చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. అనంతరం కలెక్టర్ అదనపు కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో కలిసి జాతర మైదానంలో ఏర్పాట్లను, అన్నదాన సత్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు, సీఐ రామకృష్ణ, డీపీవో పార్థసారధి, డీఎల్‌పీవో నసీరుద్దీన్, ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, తహసీల్దార్ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ముందు బీఆర్ఎస్ ధర్నా

మహబూబ్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సామాజిక మాధ్యమాలలో ప్రభుత్వ వ్యతిరేకపోస్టులు పెడుతున్నారని బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్‌ను బైండోవర్ చేయడంపై బీఆర్ఎస్ మండిపడింది. బుధవారం మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యకర్త వరద భాస్కర్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. అక్కడి నుంచి ర్యాలీగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేపట్టారు. మెసేజ్‌లు పెడితే సీఐ స్టేషన్‌కు పిలిపించి కొట్టి బైండోవర్ చేయడం ఏంటని ప్రశ్నించారు. సీఐ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకుల వద్దకు సీఐ అప్పయ్య రాగా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వాగ్వాదానికి దిగారు. పోలీసులంటే తమకెంతో గౌరవం ఉన్నదని, ఉద్యమంలో కలిసి పని చేశామని, రాష్ట్రం వచ్చిన తరువాత వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేశామని, హోంగార్డుల గౌరవ అధ్యక్షుడిగా వారి జీతాల పెంపునకు కృషిచేసిన తమనే బెదిరిస్తారా అంటూ నిలదీశారు. నాలుగేళ్ల తరువాత తిరిగి తాము అధికారంలోకి వస్తామని అప్పుడు మీరే ఇబ్బంది పడాల్సి వస్తుందని హెచ్చరించారు. కేసులకు భయపడేవాళ్ళం కాదని, ఉద్యమ సమయంలో ఇదే పాలమూరు జైలులో ఉండి తెలంగాణ సాధించుకున్నామని, వంద కాదు వెయ్యి కేసులు పెట్టినా భయపడేది లేదన్నారు. దానికి తాను మీ కార్యకర్తను కొట్టలేదని సీఐ బదులిచ్చారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చలో మహబూబ్‌నగర్ కు రాష్ట్రవ్యాప్త పిలుపునిస్తామన్నారు. కాగా ధర్నా చేస్తున్న సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు వీడియో కాల్ చేసి వరద భాస్కర్‌తో మాట్లాడారు. తప్పు చేయనప్పుడు ఎవరికీ భయపడవద్దని, నీ పంథా మార్చుకోవద్దని, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పల్లె రవికుమార్ గౌడ్, ఆంజనేయ గౌడ్, రాజుసాగర్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

హామీలపై దృష్టి పెట్టండి

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు దాటినా పాలనపై దృష్టి సారించకుండా పోలీసులను అడ్డం పెట్టుకుని అణచివేతలకు పాల్పడం మంచి పద్ధతి కాదని మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ప్రశ్నించే వారి గొంతునొక్కేందుకు కేసులు పెట్టడం సరికాదని, మా ఓపికను చేతకానితనంగా తీసుకోవద్దని హెచ్చరించారు. ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవడం బీఆర్ఎస్ పోరాటాల ఫలితమేనని చెప్పారు. ఈ సందర్భంగా బుధవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద బాణసంచా కాల్చి, సంబురాలు నిర్వహించారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే మీరెందుకంత విసుక్కుంటున్నారని అన్నారు. కొంతమంది పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని వాళ్ళు తమ తీరును మార్చుకోవాలని చెప్పారు. మళ్లీ తాము అధికారంలోకి వస్తే ఇబ్బందిపడాల్సి వస్తుందని హెచ్చరించారు. డిసెంబరు 3 తరువాత రాష్ట్ర పార్టీ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తుందని, దాని ప్రకారం ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాలు చేస్తామన్నారు. పాలమూరులో అతిపెద్ద ప్రభుత్వ ఆస్పత్రిని పూర్తి చేసి పేదలకు మెరుగైన వైద్యం అందించేలా చూడాలన్నారు. సమావేశంలో నాయకులు రాజేశ్వర్ గౌడ్, కోరమోని నర్సింహులు పాల్గొన్నారు.

స్వప్నం ఫలించిన రోజు

- పీయూను ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేద్దాం
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- పీయూలో అభినందన సభకు తరలొచ్చిన విద్యార్థులు



సభకు హాజరైన విద్యార్థులు

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఇది ఒక స్వప్నం ఫలించిన రోజు అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పాలమూరు యూనివర్సిటీకి లా, ఇంజనీరింగ్ కళాశాలల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించినందున వర్సిటీ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన అభినందన సభకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాలమూరు యూనివర్సిటీకి, తనకు తల్లీ బిడ్డకు ఉన్న పేగు బంధం ఉందన్నారు. 2012లో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడుతున్న తరుణంలో వర్సిటీకి నిధుల కోసం ఇక్కడి విద్యార్థులు, యూనియన్ నాయకులతో సమావేశం అయ్యామన్నారు. 365 రోజులు ఉద్యమం చేద్దామని, కానీ ఒక్క రోజు ఉద్యమం ఆపి ముఖ్యమంత్రికి సహకరిస్తే యూనివర్సిటీకి అధిక నిధులు మంజూరు చేయించుకునే అవకాశం ఉంటుందని ఒప్పించానన్నారు. దాంతో పీయూకి అప్పటి సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి వచ్చి రూ.18 కోట్లు మంజూరు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం, ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశీర్వాదంతో పీయూ ఈస్థాయికి చేరుకుందని అన్నారు. లా, ఇంజనీరింగ్, హ్యూమనిటీస్ అండ్ సోషల్ సైన్స్ కళాశాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రముఖ ఐఐటీలతో టైఅప్ అయ్యి, వర్సిటీని ప్రపంచంలోనే ప్రఖ్యాత విశ్వవిద్యాలయంగా తీర్చుదిద్దుకుందామన్నారు. కొత్త కొత్త ఆవిష్కరణలకు చిరునామాగా మార్చుకుందామని తెలిపారు. ప్రపంచ స్థాయి గుర్తింపు తేవడంతో పాటు అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని అన్నారు. కొత్త కోర్సులతో పాటు ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. పేద విద్యార్థులు దూర ప్రాంతలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా ఇక్కడే అన్ని రకాల కోర్సులను ఏర్పాటు చేసి, ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అంతకు ముందు పీయూ వీసీ మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి మూడు బ్రాంచ్‌లతో ఇంజనీరింగ్ తరగతులు ప్రారంభిస్తామన్నారు. నాణ్యమైన విద్య అందించడంలో రాజీ పడేది లేదన్నారు. పీయూని అత్యుత్తమ వర్సిటీగా తీర్చిదిద్దుతామని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, పీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ చైర్మన్ అనిత రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంలపై సస్పెన్షన్ ఎత్తివేత



రాష్ట్ర, జిల్లా నాయకులతో జీహెచ్‌ఎంలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం అక్టోబరు 30 : స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై జిల్లాలో సస్పెండ్ అయిన పదకొండు మంది గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులపై బుధవారం సస్పెన్షన్ ఎత్తివేస్తూ ఆర్జేడీ విజయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ గత ఏడాది 2023 సెప్టెంబరులో జరిగిన బదిలీల్లో స్పౌజ్ పాయింట్ల విషయంలో తప్పిదాలు చేశారని పూర్తి విచారణ చేసి, ఈ నెల 19న 11 మందిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. దీనిపై పలు సంఘాల నాయకులు, సస్పెండ్ అయిన జీహెచ్‌ఎంలు కమిషనర్‌ను కలిసి తాము ఎలాంటి తప్పు చేయలేదని, తమపై అన్యాయంగా చర్యలు తీసుకున్నారని విన్నవించారు. దీనిపై మంగళవారం వివరణ తీసుకున్న అధికారులు బుధవారం వారిపై సస్పెన్షన్ ఎత్తివేశారు. వారు గతంలో కొనసాగుతున్న పాఠశాలల్లోనే విధులు నిర్వహించేలా ఉత్తర్వులు ఇచ్చారు. జీహెచ్‌ఎంల సంఘం తరుపున పలుమార్లు ఆర్జేడీని కలిసి తాము ఎలాంటి తప్పు చేయలేదని వివరించినట్లు జిల్లా టీఎస్‌జీహెచ్‌ఎంఏ అధ్యక్షుడు జగదీష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి రాజ్‌గంగారెడ్డి ఆర్జేడీని కలిసి విన్నవించినట్లు తెలిపారు. 11 మందిపై సస్పెన్షన్ ఎత్తివేయడంపై ఆర్జేడీకి కృతజ్ఞతలు తెలిపారు.

రైలు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రాజాపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ గ్రామంలోని స్థానిక రైల్వే స్టేషన్‌లో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ ప్రాంతానికి రాములు రంగారెడ్డిగూడ గ్రామంలో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తు ప్రమాదం చోటు చేసుకో వడంతో రెండు కాళ్లు కోల్పోయాడు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నాగారంలో వైద్య శిబిరం

దేవరకద్ర, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగారం గ్రామంలో బుధవారం ప్రీతి ప్యూర్ ఫాండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణుడు చంద్రమోహన్ రోగులను పరీక్షించారు.

రేపు జిల్లా స్థాయి ఖోఖో పోటీలు

కోయిలకొండ, అక్టోబరు 30 (ఆంధజ్యోతి): మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఎంఈవో వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలను ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి

- నారాయణపేటలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నరేష్

నారాయణపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న రూ.7800 కోట్ల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నరేష్ డిమాండ్ చేశారు. బుధవారం నారాయణపేటలో పరిషత్ ఆధ్వర్యంలో పురవీధుల గుండా విద్యార్థులతో కలిసి నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సత్యనారాయణ చౌరస్తాలో చేపట్టిన ధర్నానుద్దేశించి నరేష్ మాట్లాడారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ల బకాయిలతో కళాశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులు అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యార్థులను పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే స్కాలర్‌షిప్స్ విడుదల చేసి నిరుపేద విద్యార్థులను ఆదుకోవాలని, లేకపోతే పరిషత్ ఆధ్వర్యంలో సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సతీష్, ఇంతియాజ్, వినయ్‌కుమార్, చైత్ర, లక్ష్మణ్, చరణ్, వివేకానంద, వెంకటేష్, మౌలాలి, అభిరామ్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలవాలంటే కార్యకర్తలు పెరగాలి

ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు రాములు

మహబూబ్‌నగర్ క్లాక్‌టవర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలలో గెలవాలంటే కార్యకర్తల సంఖ్యాబలం పెరగాలని, ఆ దిశగా నాయకులు పనిచేయాలని ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు రాములు పిలుపునిచ్చారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పార్టీ క్రియాశీల కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై కార్యకర్తలను, నాయకులను ఉద్దేశించి మా ట్లాడారు. పార్టీలో క్రియాశీల సభ్యత్వం తీసుకునేందుకు కనీసం ఆ సభ్యుడు 100 మందిని బీజేపీలో సభ్యత్వం ఇప్పించాలని తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాకుల బాలరాజు, రవీందర్ రెడ్డి, నాయకులు రమేష్‌కుమార్, ఎంబీ బాలకృష్ణ వాల్మీకి, రాపోతుల శ్రీనివాస్‌గౌడ్, రాజేష్, సుబ్రహ్మణ్యం, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు ప్రారంభం

పెంట్లవెల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొండూరు గ్రామంలో ఒంగోలు జాతి ఎద్దుల బండలాగుడు పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. మాజీ సర్పంచు నల్లపోతుల గోపాల్, కెఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ కొత్త కళ్యాణ్‌రావు, రత్నగిరి ఫౌండేషన్ చైర్మన్ కేతూరి ధర్మతేజ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ స్థాయి బండలాగుడు పోటీలు ప్రతీ సంవత్సరం నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. మొదటి రోజు బుధవారం ఆరుపళ్ల విభాగానికి మొత్తం 18 జతల ఎద్దులు పాల్గొన్నాయన్నారు. గురువారం న్యూ కేటగిరి విభాగం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొండూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు రెడ్డిరవి, సత్యనారాయణరావు, గంగన్న పాల్గొన్నారు.

బోరు మోటార్ల చోరీ

- పోలీసులకు ఫిర్యాదు

నవాబ్‌పేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వేరుశనగ పంటకు ఏర్పాటు చేసిన బోరు మోటర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని ఓ యువకుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ విక్రం కథనం ప్రకారం.. వివరాలు ఇలా ఉన్నాయి. కోళ్ల గుట్ట తండాకు చెందిన చందునాయక్ తన వ్యవసాయ పొలం (సర్వేనెంబరు-137) లో వేరుశనగకు ఏర్పాటు చేసిన బోరు మోటర్‌ను ఈ నెల 29న గుర్తు తెలియని వ్యక్తులు అపహరిం చారు. ఉదయం 6 గంటలకు వెళ్లి చూడగా పాల్కన్ 7 హెచ్‌పీ, మా పక్కపొలం రైతు అయిన రవి 7 హెచ్‌పీ మోటర్లు, కేబుల్ వైర్లు కనిపించలేదని బుధవారం ఫిర్యాదు చేయడం తో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బంతికి భలే డిమాండ్

- సన్నకారు రైతులకు లాభాలు కురిపిస్తున్న బంతి సాగు



లింగాయిపల్లి దగ్గర బంతి పూలు తెంపుతున్న రైతు మల్లేష్

గండీడ్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బంతి రైతుకు ఎంతో మేలు చేస్తోంది. బంతిపూల సాగు చాలా అరుదుగా చేస్తుంటారు. ఈ పూల సాగు సీజన్‌గా ఉంటుంది. దసరా.. దీపావళి పండుగలకు భలే డిమాండ్ ఉంటుంది. అందుకే రైతులు ఈ పండగల సీజన్‌కు దిగుబడి వచ్చే విధంగా తోటలు సాగు చేస్తుంటారు. కొన్ని సందర్భాల్లో వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి పూలను దిగుమతి చేసుకుంటే రైతు పరిస్థితి అగమ్యగోచరంగా ఉంటుంది. అందుకే చాలా తక్కువ మంది రైతులు ఈ పూలతోట సాగు చేస్తుంటారు. ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా పూలతోటలు దెబ్బతిన్నాయి. దీంతో డిమాండ్ పెరిగింది. దసరా, దీపావళి పండుల సందర్భంగా ఇంటి గుమ్మాలకు తోరణాలు కట్టడం, దుకాణాలను అలంకరించడం, లక్ష్మి పూజలు, గౌరీ నోములు, వ్రతాలకు బంతిపూలను అధికంగా వినియోగిస్తుంటారు. దీంతో డిమాండ్ ఉంటుంది. ఆ తరువాత పెళ్లిళ్ల, గృహ ప్రవేశాలకు వినియోగించుకుంటారు. దీంతో బంతి సాగు చేసుకున్న రైతులకు ఈ సీజన్‌లో దిగుబడి వస్తే లాభాలు పొందుతారు. దీనికోసం తక్కువ పెట్టుబడి ఉన్న బంతిపూల సాగును ఎంచుకోవడం ఆదాయానికి మార్గం వేసుకున్నట్లే. గండీడ్ మండలంలోని లింగాయిపల్లి గేటు దగ్గర రైతు మల్లేష్ అర ఎకరా బంతి సాగు చేశాడు. ప్రతీ ఏడాది బంతి సాగు చేస్తున్నట్లు రైతు తెలిపారు. ఉమ్మడి మండలంలో గాధిర్యాల్ గ్రామంలో కూడా ఓ రైతు బంతి సాగు చేశాడు.

త్వరగా అమ్ముడు పోతాయి



నేను డిగ్రీ వరకు చదువుకున్నా.. అర ఎకరా పొలంలో రూ.15 వేల పెట్టుబడితో బంతి సాగుచేశాను. ఈ పూలను తెంపిన వెంటనే కోస్గి మార్కెట్‌లో విక్రయిస్తా. తాను విక్రయిస్తే కిలో బంతి రూ.80లకు విక్రయిస్తున్నా.. వ్యాపారులకు విక్రయిస్తే కిలో రూ.60 ధర చెల్లిస్తున్నారు. ఈ ఏడాది మం చి ధర ఉండటంతో లాభాలు వస్తాయి. పండుగ సీజన్ కావ డంతో త్వరగా అమ్ముడు పోతున్నాయి.

- మల్లేష్, యువ రైతు

ఆధునిక పద్ధతులతోనే ఆధిక దిగుబడి



రైతులకు ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

మూసాపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సేంద్రియ ఎరువులు, శాస్త్ర సాంకేతిక విధానాలతోనే అధిక దిగుబడి పొందవచ్చని మహబూబ్‌నగర్ ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ భరత్ భూషన్ సూచించారు. బుధవారం మండలంలోని వేముల రైతు వేదికలో పాలెం వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థుల ఆధ్వర్యంలో రైతు విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయనతో పాటు శాస్త్రవేత్తలు శైల, శ్రీధర్, అర్చన, వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ అర్చన, మండల వ్యవసాయ అధికారి అనీల్‌కుమార్ హాజరయ్యారు. సేంద్రియ పద్ధతుల ద్వారా వ్యవసాయ సాగు విధానాలు, నూతన పద్ధతులు, యాంత్రీకరణ విధానం, స్థూలమైన సాంద్రీకృత ఎరువులు, నూనె కషయాలు, వేపనూనె మిశ్రమాలను ఎలా ఉపయోగించాలనే అంశాలపై రైతులకు వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ శైల వరి పంటకు సంక్రమించే అగ్గితేగులు, కాటుక తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వేరుశనగ విత్తనశుద్ధి, సస్యరక్షణ చర్యలపై వివరించారు. అదే విధంగా వర్మీకంపోస్టు ఎరువులు, సమీకృత వ్యవసాయం, కలుపు మందులు, అంతర పంటలు, వరిలో డ్రమ్ సీడర్, సుస్థిర వ్యవసాయం, పాలీహౌస్, బయోప్లాంటు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సుమారు 150 మంది విద్యాలయ విద్యార్థులు నిర్వహించిన సదస్సులో ఏర్పాటు చేసిన విజ్ఞానాలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సతీష్ రెడ్డి, హార్టికల్చర్ అధికారి శ్రుతి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు యాట సత్యనారా యణ, నాయకులు గోవర్ధన్, రవీందర్‌గౌడ్, రవిరాజా చారి, కాశీమ్, కొండారెడ్డి, సత్యనారాయణరెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త నిబంధనల ప్రకారం ధాన్యం కేటాయింపు

- అదనపు కలెక్టర్ కె.సీతారామారావు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కె.సీతారామారావు

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం విధించిన నూతన నిబంధనల ప్రకారం ఖరీఫ్ వరి ధాన్యాన్ని మిల్లర్లకు కేటాయించి సరఫరా చేస్తామని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.సీతారామారావు స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సివిల్ సప్లై అధికారులు, మిల్లర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం జీవో ఎంఎస్ నెం.27 ద్వారా తీసుకు వచ్చిన నూతన విధానాల్లో మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయాలంటే బ్యాంకు గ్యారెంటీ లేదా సెక్యూరిటీ డిపాజిట్లను సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం మిల్లర్లను నాలుగు రకాలుగా విభజించిందని, అందులో గతంలో ఎలాంటి బకాయిలు లేని మిల్లర్లు 10 శాతం బ్యాంకు గ్యారెంటీ లేదా 25 శాతం సెక్యూరిటీ డిపాజిట్ సమర్పించాలని తెలిపారు. అదేవిధంగా రెండో రకంలో గతంలో బకాయిలు, పెనాల్టీ ఉన్న మిల్లర్లు 20 శాతం బ్యాంకు గ్యారెంటీ లేదా 25 శాతం సెక్యూరిటీ డిపాజిట్, మూడో రకంలో వందశాతం బకాయిలు చెల్లించి 25 శాతం పెనాల్టీ ఉన్న మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీ, సెక్యూరిటీ డిపాజిట్లను 25 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇక నాలుగో రకంలో డీఫాల్టర్లుగా ఉన్న మిల్లర్లకు ఈసారి ధాన్యం కేటాయింపు జరగదని స్పష్టం చేశారు. రైస్ మిల్లర్ల అసోసియేషన్ అభ్యర్థన మేరకు మిల్లర్లకు అదనపు మిల్లింగ్ చార్జీలు కూడా అందజేస్తామన్నారు. అవి దొడ్డు రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.30, సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.40 మిల్లింగ్ చార్జీలు చెల్లిస్తామని పేర్కొన్నారు. మిల్లర్లకు కేటాయించిన ధాన్యాన్ని జిల్లాలోని గోదాముల్లో భద్రపరుస్తామని తెలిపారు. మిలర్లు తప్పనిసరిగా దొడ్డు రకం, సన్న రకం ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటికే 127 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. సీఆర్ఆర్ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అందించేందుకు తుది గడువు నేటితో ముగియనుందని, పెండింగ్‌లో ఉన్న మిల్లర్లు సీఎంఆర్ బియ్యాన్ని వెంటనే ఎస్‌సీఐకి అందజేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీఎం రాజేందర్, జిల్లా పౌరసరఫరాల అధికారులు, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

తగ్గు ముఖం పట్టిన ఉల్లి ధర

- క్వింటాలుకు గరిష్ఠంగా. రూ. 2600 కనిష్ఠంగా. రూ. 1360

దేవరకద్ర, అక్టోబరు 30 (ఆంధజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు పండించిన ఉల్లి విక్రయించేందుకు బుధవారం వ్యవసాయ మార్కెట్‌యార్డుకు తీసుకొచ్చారు. మార్కెట్‌లో జరిగిన లావదేవీల్లో గత మూడు వారాల నుంచి ఉల్లి ధరలు రోజు రోజుకు తగ్గుముఖం పడుతున్నాయి. వ్యాపారస్తులు నిర్వహించిన వేలంలో గరిష్ఠంగా రూ.2600, కనిష్ఠంగా. రూ. 1360 ధర పలికినట్లు మార్కెట్ సెక్రటరి జయ్యలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు వచ్చిన ఉల్లిలో తెల్లగా నాణ్యంగా ఉన్న వాటికి కొంత వరకు డిమాండ్ ఉండగా ఇక ఎర్ర ఉల్లిని కొనేవారు కరువయ్యారు. విత్తనాలు కొనే సమయంలో ఉల్లి రకం ఎలా ఉంటుందో తెలియని రైతులు దిగుబడులు వచ్చాక నెత్తిన చేతులు పెటుకుంటున్నారు. మార్కెట్‌కు ఎక్కువగా ఎర్ర ఉల్లి అమ్మకానికి వచ్చింది. వ్యాపారులు, చిరు వ్యాపారులు ఎక్కువగా ఎర్ర ఉల్లిని కొనుగోలు చేశారు. మార్కెట్‌కు 40 క్వింటాళ్ల ఉల్లి అమ్మకానికి వచ్చినట్లు తెలిపారు.

సారు సన్మాన కార్యక్రమానికి..

పాఠశాలకు తాళం

- కిషన్‌గూడ ఉపాధ్యాయుడి నిర్వాకం



పాఠశాల డోర్‌కు వేసిన తాళం

నవాబ్‌పేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పక్క పాఠశాలలో ఉపాధ్యాయుడి పదవీ విరమణ కార్యక్రమం ఉండగా ఉపాధ్యాయుడు తన పాఠశాలకు తాళం వేసి వెళ్లిన సంఘటన బుధవారం చోటుచేసుకున్నది. మండలంలోని కిషన్‌గూడ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను మధ్యాహ్న భోజనం చేయించి.. 1.30 గంటల సమయంలో ఆ ఉపాధ్యాయుడు సన్మాన కార్యక్రమానికి వెళ్లారు. మండలంలోని లింగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీహెచ్‌ఎం పదవీ విరమణ కార్యక్రమం ఉండగా మండలంలోని కిషన్‌గూడ ఉపాధ్యాయుడు రాఘవేందర్ విద్యార్థులను ఇంటికి పంపించి తను పాఠశాలకు తాళం వేసుకుని వెళ్లిపోవడంతో విద్యార్థులు గ్రామంలో తిరుగుతూ కనిపించారు. పలు పాఠశాలల్లో కూడా ఇలాంటి పరిస్థితి కనిపించింది.

ఉన్న ఊరిలో ఉపాధి లేక.. నడిగడ్డకు వలస

పత్తితీత పనుల కోసం వస్తున్న కూలీలు

» ఏపీ, కర్ణాటకల నుంచి ఎక్కువ మంది రాక » ఊరి బయట గుడారాల్లో నివాసం



సెంటు పొలం కూడా లేక...

ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధ దంపతులు కర్ణాటక రాష్ట్రంలోని చిన్నూరు గ్రామానికి చెందిన హుస్సేన్ మియా, సైదాబీ దంపతులు. వీరికి ముగ్గురు కొడుకులున్నారు. వారికి పెళ్లిళ్లు అయిపోయి ఎవరి బతుకు వారు బతుకుతున్నారు. దీంతో ఏడు పదులు దాటిన వయసులో వీరు పని కోసం జల్లాపురం గ్రామానికి వచ్చారు. సెంటు భూమి కూడా లేని తమకు ఇదే జీవనాధారమని హుస్సేన్‌మియా 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

అలంపూర్ చౌరస్తా, అక్టోబరు 30, (ఆంధ్రజ్యోతి) : ఉన్న ఊరిలో ఉపాధి లేక పొరుగు రాష్ట్రాల నుంచి కూలీలు వలస వస్తున్నారు. నడిగడ్డ ప్రాంతమైన అలంపూర్ నియోజక వర్గంలోని వడ్డేపల్లి, ఇటిక్యాల, మానవపాడు, ఉండవల్లి, అలంపూర్ మండలాల్లో సారవంతమైన భూములున్నాయి. మూడేళ్లుగా తుమ్మిళ్ల ఎత్తిపోతల నుంచి సాగునీరు సరఫరా అవుతుండటంతో రైతులు మిర్చి, పత్తి, పొగాకు పంటలను అత్యధికంగా సాగు చేస్తున్నారు. ఈ ఏడాది 1.40 లక్షల ఎకరాల్లో పత్తి, 10 వేల ఎకరాల్లో పొగాకు, 45 వేల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. ఈ నేపథ్యంలో స్థానికంగా కూలీల కొరత ఏర్పడింది. ప్రధానంగా పత్తితీత పనులకు ఇబ్బందిగా మారడంతో పొరుగు రాష్ట్రాల నుంచి కూలీలను రప్పించుకుంటున్నారు. ఇలా మానవపాడు మండలం జల్లాపురం, ఉండవల్లి మండలంలోని మారమూనగాల-2, ప్రాగటూరు గ్రామాల సమీపంలో గుడారాలు వేసుకొని నివసిస్తున్న కూలీలతో 'ఆంధ్రజ్యోతి' మాట్లాడింది. ఆ వివరాలిలా ఉన్నాయి..



ముని మనవలు, మనమరాళ్లతో 90 ఏళ్ల తిమ్మక్క

కేజీల లెక్కన పత్తి తీత కూలి

నడిగడ్డకు వలస వస్తున్న కూలీలు కిలో పత్తి తీసేందుకు రూ.12 నుంచి రూ. 15 వరకు కూలి తీసుకుంటారు. ప్రతీ ఒక్కరు రోజుకు 80 నుంచి 120 కిలోల వరకు పత్తి తీస్తారు. ఇలా రోజుకు వెయ్యి రూపాయలకు పైగా సంపదిస్తామని కూలీలు తెలిపారు. ఇలా సంపాదించుకున్న డబ్బుతో పిల్లల పెళ్లిళ్లు, అప్పులు తీర్చుకోవడం, ఇల్లు నిర్మించుకోవడం వంటి ప్రధాన అవసరాల కోసం వినియోగించుకుంటామని చెప్పారు. ఇలా వలస వచ్చిన వారిలో దాదాపు 70 శాతం మంది వాల్మీకి బోయ సామాజిక వర్గానికి చెందిన వారే కావడం గమనార్హం.

'సుగ్గి' కోసం అక్కడి నుంచి ఇక్కడికి..

పత్తి తీత పనుల కోసం వలస రావడాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని పల్లె జనం 'సుగ్గి' అంటారు. ఇలా పనుల కోసం నడిగడ్డలోని పడమటి ప్రాంతాలైన కేటీదొడ్డి, అయిజ, చాగదోణ, గట్టు, బల్గెర, నందిన్నె, మల్దకల్, ఇందువాసి, బోయలగుడెం, గొర్లఖాన్‌దొడ్డి, మిట్టదొడ్డి, భూంపురం, తిత్తినోనిదొడ్డి తదితర గ్రామాల నుంచి తూర్పు ప్రాంతంలోని గ్రామాలకు వలస వస్తున్నారు. అలాగే ఆంధ్ర ప్రదేశ్‌లోని సి.బెళగల్, గోనేగండ్ల, పోల్‌కల్, గూడూరు, ఆలూరు, మంత్రాలయం, పత్తికొండ, పెద్ద కడుబూరు, కోసిగి, ఎమ్మిగనూరు, దైవందిన్నె, కర్ణాటక రాష్ట్రంలోని చిన్నూరు, గాంధీనగర్, ఇడపనూరు, తలమారి, ఎరగేర, సింధనూరు తదితర ప్రాంతాల నుంచి కూలీలు వస్తున్నారు. ప్రతీ సంవత్సరం దసరా తర్వాత పత్తితీత పనుల కోసం వచ్చే వీరు, ఆయా గ్రామాల చివర దుప్పట్లు, టార్పాలిన్లతో గుడిసెలు వేసుకుని, అక్కడే నివసిస్తారు. అలాగే ఈ ఏడాది కూడా వేలాది కుటుంబాలు చంటిపిల్లలతో సహా వచ్చారు. తెల్లవారుజామునే వంటలు చేసుకుని చంటిబిడ్డలను సంకనేసుకొని పొలం బాట పడుతున్నారు. తిరిగి సాయంత్రం ఐదు గంటల తర్వాత తాము నివసించే గుడారాలకు చేరుకుంటున్నారు. నీరు నిప్పు పోగేసుకొని, వంటావార్పు పూర్తి చేసుకొని భోజనాలు చేసి, నిద్రపోతారు. పత్తితీత పనులు పూర్తయ్యేదాకా ఇదే వారి దినచర్య. ఆ తర్వాత స్వగ్రామాలకు తిరిగి వెళ్లే వారు, ఆ వెంటనే గుంటూరు, నర్సరావుపేట, మార్కాపురం, గిద్దలూరు తదితర ప్రాంతాల్లో మిర్చి కోతలకు మళ్లీ వలస వెళ్తారు. అక్కడ పనులు పూర్తయ్యాక ఉగాది నాటికి స్వగ్రామాలకు చేరుకుంటారు.

సాగు చేయాలంటే.. అప్పు చేయాలి



మాకు రెండెకరాల తువ్వ పొలం ఉంది. కానీ ఎగుసం చేయాలంటే అప్పు చేయాలి. అంత కష్టపడితే వచ్చేదేమో రాందేమో.. తెల్వదు. అందుకే ఆడ ఉన్న భూమిని కౌలుకు వేసినం. భర్త హనుమంతు, ఇద్దరు పిల్లలతో పత్తితీతకు జల్లాపురానికి వచ్చాం. ఈడకొచ్చి కూలినాలి చేసుకుంటే కాసిన్ని దుడ్లు పొగైతున్నయి. దీంతోని మా అక్కరలు తీర్తయి.

శంకరమ్మ, బల్గెర, గట్టు మండలం



జల్లాపురం గ్రామం నుంచి నీరు తెచ్చుకుంటున్న మహిళలు

వలస బాటతో జీవనోపాధి

ఏపీ, కర్ణాటకల్లోని ఆయా గ్రామాల్లో ఉపాధి లేకపోవడంతో వారికి వసల బాటే శరణ్యమవుతోంది. కొందరికి సొంత భూములు లేకపోవడం, పొలం ఉన్నా సాగుకు అనుకూలంగా ఉండక పోవడంతో పని కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడం తప్పనిసరి అవుతోందని వారు చెప్పారు. అక్కడ ఉపాధిహామీ పనులు కొనసాగుతున్నా కూలి గిట్టు కాకపోవడం మరో కారణమని అంటున్నారు. మరి కొందరికి సొంత భూములున్నా, సాగు ఖర్చులు భరించలేకపోతున్నారు. దీంతో ఉన్న ఒకటి, రెండు ఎకరాల భూమిని కౌలికి ఇచ్చి వలస బాట పడ్తున్నారు. అయితే ఈ వలసలతో వారి పిల్లలు మాత్రం చదువుకు దూరం అవుతున్నారు. పనుల కోసం చంటి బిడ్డలతో సహా వస్తుండటంతో వారు బడికి వెళ్లే పరిస్థితి లేకపోయింది. ఆ చిన్నారులు స్థానికంగా ఉన్న పాఠశాలల్లో చదువుకునేందుకు అవకాశం కల్పిస్తే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.



కర్ణాటక రాష్ట్రం ఎరిగేర నుంచి కుటుంబాలతో సహా వలస వచ్చిన కూలీలు

రాష్ట్రంలో క్రీడలకు పెద్దపీట

» క్రీడలకు రూ.364 కోట్ల బడ్జెట్

» మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



విజేత ఆదిలాబాద్ బాలికల జట్టుకు కప్ అందిస్తున్న ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తోందని, అందుకోసం బడ్జెట్‌లో క్రీడా రంగానికి రూ. 364 కోట్లు కేటాయించిందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని స్టేడియం మైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి బాల, బాలికల ఖోఖో టోర్నీ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్‌తో కలిసి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి, వర్ధమాన క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు. సీఎం కప్ పేరుతో మండల, జిల్లా స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, వైస్ చైర్మన్ పెద్ద విజయ్, మునిసిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, తెలంగాణ ఖోఖో సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి విలియం, కార్య నిర్వాహక కార్యదర్శి బాల్‌రాజ్, తెలంగాణ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం (టీజీపెట) రాష్ట్ర అధ్యక్షుడు దూమర్ల నిరంజన్, వ్యాయా మ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, మధుకుమార్, మెర్సీ, కృష్ణయ్య, మోయిన్ పాల్గొన్నారు.

ఖోఖో చాంపియన్ ఆదిలాబాద్

రాష్ట్ర స్థాయి ఖోఖో టోర్నీలో భాగంగా బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్, బాల, బాలికల విభాగంలో ఆదిలాబాద్ జట్టు చాంపియన్‌గా నిలిచింది. బాలుర విభాగంలో ఆదిలాబాద్ జట్టు రంగారెడ్డిపై 38-36, బాలికల విభాగంలో ఆదిలాబాద్ జట్టు నల్గొండపై 20-16 స్కోర్ తేడాతో గెలిచి విజేతగా నిలిచాయి. బాలుర విభాగంలో రంగారెడ్డి, బాలికల విభాగంలో నల్గొండ జట్లు రన్నర్లుగా స్థానం దక్కించుకున్నాయి. బాలుర విభాగం, మూడవ స్థానంలో వరంగల్, నాలుగో స్థానంలో మెదక్, బాలికల విభాగంలో మూడో స్థానంలో హైదరాబాద్, నాలుగో స్థానంలో రంగారెడ్డి నిలిచాయి.

రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు గురుకుల విద్యార్థినుల ఎంపిక



ఎంపికైన బాలికలతో ప్రిన్సిపాల్ చంద్రకళ, సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలం

మక్తల్, మాగనూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు సోషల్ వెల్ఫేర్ మక్తల్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న నిర్వహించిన పది కిలోమీటర్ల సైక్లింగ్ పోటీల్లో అండర్ - 14 విభాగంలో అర్చన ప్రథమ స్థానం, లాసియా ద్వితీయ స్థానంలో నిలిచారు. అండర్ - 21 విభాగంలో శ్రీలత మొదటి స్థానం, నందిని ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం వారిని సైక్లింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలం, ప్రిన్సిపాల్ చంద్రకళ అభినందించారు. జనగామలో నాలుగు నుంచి ఆరవ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. అలాగే కృష్ణ మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థిని, మాగనూరు మండలం ఉజ్జెల్లి గ్రామానికి చెందిన బి.భారతి కూడా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

యువకుడి అవయవ దానం

» జీవన్‌దాన్ స్వచ్ఛంద సంస్థకు అప్పగించిన కుటుంబ సభ్యులు



జిట్టెం శ్రీను (ఫైల్)

మక్తల్ రూరల్, అక్టోబరు 30, (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, బ్రెయిన్ డెడ్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతడి అవయవాలను దానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలోని అంకెన్‌పల్లి గ్రామానికి చెందిన జిట్టెం శ్రీను (36) మక్తల్ నుంచి నారాయణపేటకు వెళ్లి వస్తుండగా, ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని యశోదా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ మూడు రోజులు కోమాలో ఉన్న తర్వాత, బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో అతడి లివర్, రెండు కిడ్నీలు, ఊపిరి తిత్తులతో పాటు, గుండెను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించి జీవన్‌దాన్ స్వచ్ఛంద సంస్థకు అప్పగించారు. అంతులేని దుఃఖంలో ఉన్నా అవయవదానానికి అంగీకరించిన వారిని పలువురు అభినందించారు.

చెక్ డ్యాంలో యువకుడి గల్లంతు



చెక్‌డ్యాం వద్ద సంఘటన వివరాలను తెలుసుకుంటున్న పోలీసులు

గోపాల్‌పేట, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని బుద్దారం గండి చెక్ డ్యాంలో పడి ఓ యువకుడు గల్లంతు అయ్యాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు శ్రీను, విష్ణు (22) బుధవారం మధ్యాహ్నం బుద్దారం గ్రామ సమీపంలోని చెక్ డ్యాం వద్ద మద్యం తాగారు. ఆ తర్వాత ఈత కొట్టేందుకు చెక్‌డ్యాంలో దూకారు. ఆ తర్వాత కొద్దిసేపటికి శ్రీను ఒక్కడే బయటికి వచ్చాడు. విష్ణు బయటకు రాకపోవడంతో అక్కడే ఉన్న స్థానికులు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ నరేశ్‌కుమార్, అగ్నిమాపక సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. చెక్‌డ్యాంలో గాలింపు చేపట్టారు. రాత్రి 8.30 గంటల వరకు గాలించినా, విష్ణు ఆచూకీ లభించలేదని ఎస్ఐ తెలిపారు.

గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

» మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

» జానంపేటలో ఆదర్శ గ్రామీణ ఆరోగ్య పరిశోధనా కేంద్రం ప్రారంభం



ఆరోగ్య పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ డీకే అరుణ

మూసాపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలంలోని జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆదర్శ గ్రామీణ ఆరోగ్య పరిశోధనా కేంద్రాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. కేంద్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నాలుగు కోట్ల రూపాయల వ్యయంతో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసర్చ్ (ఐసీఎమ్మార్), నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) వారు ఈ పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఎంపీ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ఐసీఎమ్మార్ కరోనా వ్యాక్సిన్‌ను తయారు చేసి మన దేశంతో పాటు ఇతర దేశాలకు అందించడంలో విజయం సాధించిందని గుర్తు చేశారు. ఈ సంస్థ దేశంలోని అన్ని రాష్ట్రాల్లో గ్రామీణ ఆరోగ్య పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. గ్రామీణ ప్రజల ఆరోగ్య స్థితిగతులు, ఎలాంటి వ్యాధులు ప్రబలుతున్నాయనే అంశాలపై పరిశోధన చేస్తుందని తెలిపారు. ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన సలహాలు, వ్యాధి నివారణ మార్గాలను ప్రజలకు వివరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఐసీఎమ్మార్ నోడల్ అధికారి డాక్టర్ భానుప్రకాశ్ రెడ్డి, ఎన్ఐఎన్ అదనపు సంచాలకుడు డాక్టర్ ఉదయ్ కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ బాధ్యుడు కొండా ప్రశాంత్‌రెడ్డి, నాయకులు చెన్నంపల్లి చంద్రశేఖర్ రెడ్డి, రవీందర్‌గౌడ్, బాల్‌రెడ్డి, కొండారెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాగరాజు, విష్ణు, నరేష్, బుచ్చిరెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అదృశ్యమైన చెంచు యువకుడు క్షేమం

మన్ననూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అభయా రణ్యంలో మంగళ వారం అర్ధరాత్రి తప్పి పోయిన చెంచు యువ కుడు క్షేమంగా ఉన్నా డు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల పరిధిలోని మల్లాపూర్ పెంటకు చెందిన చిగుర్ల లక్ష్మయ్య మతి స్థిమితం కోల్పోయాడు. మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు అతడి కోసం బుధవారం ఉదయం అడవిలో వెతికారు. మధ్యాహ్నం సమయంలో దేవర పెంట శివారులో స్థానికులకు అతడు కన్పించాడు. అక్కడే నివసించే నిమ్మల మల్లయ్య, చిగుర్ల లింగయ్యలు అతడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

హన్వాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు బుధవారం ఉదయం మృతి చెందాడు. ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం నాయినోనిపల్లి గ్రామానికి చెందిన తుప్పలి చెన్నయ్య (28) ఈనెల 26న హన్వాడ సమీపంలోని బాలాజీ కొండ సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. ప్రమాదంలో అతడి తల, కాలికి తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి అన్న గంగాపురం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

దామరగిద్ద, అక్టోబరు 30, (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యాన్ని భరించలేక పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల కేంద్రానికి చెందిన బోయ అనీల (32) అనారోగ్యాన్ని భరించలేక ఈ నెల 26న అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన భర్త ఈదప్ప ఆమెను నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమిం చడంతో మెరుగైన చికిత్స కోసం మహబూబ్ నగర్ జిల్లా ప్రధాన ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు మృతి చెందింది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సంఘటనపై ఆమె తమ్ముడు కిందగేరి నరేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అరుణ్ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

» వివరాలను వెల్లడించిన జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి



కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ ఆదిరెడ్డి, చిత్రంలో నిందితుడు అబ్బాస్ అహ్మద్ (ముసుగులో ఉన్న వ్యక్తి)

జడ్చర్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల న్యూబస్టాండులో ఇటీవల జరిగిన రెండు చోరీ సంఘటనల్లో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు. జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 23న భానుప్రకాశ్ అనే వ్యక్తి పెబ్బేర్ నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సులో వెళ్తూ మధ్యాహ్న భోజనం కోసం జడ్చర్ల న్యూ బస్టాండులో దిగాడు. ఆ సమయంలో బస్సులో ఉంచిన ల్యాప్‌టాప్ చోరీకి గురయ్యింది. అలాగే ఈ నెల 28న కాసం ఉపేంద్ర అనే వ్యక్తి భార్యతో కలిసి బస్సులో కర్నూల్ నుంచి జనగాంకు ఆర్టీసీ వెళ్తూ భోజనం కోసం బస్సు దిగారు. ఆ సమయంలో బస్సులో ఉన్న వారి రెండు బ్యాగులు చోరీకి గురయ్యాయి. అందులో తొమ్మిది తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ రెండు కేసులకు సంబంధించి ఎస్ఐ శివానందం దర్యాప్తు చేపట్టారు. బస్టాండ్‌లోని సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నిందితుడు జడ్చర్ల మునిసిపాలిటీ కావేరమ్మపేటకు చెందిన అబ్దుల్‌అబ్బాస్‌గా గుర్తించి అదుపులోకి అరెస్టు చేసి విచారించారు. అతడి నుంచి ల్యాప్‌ట్యాప్‌తో పాటు తొమ్మిది తులాల బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. విలేకరుల సమావేశంలో జడ్చర్ల ఎస్ఐ శివానందం, కానిస్టేబుళ్లు నరసింహరాజు, విష్ణువర్ధన్, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

బస్టాండ్‌లో రూ.3.69 లక్షలు చోరీ

జడ్చర్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల న్యూ బస్టాండ్‌లో ఓ మహిళ బ్యాగులో నుంచి రూ. 3.69 లక్షలు చోరీకి గురయ్యాయి. సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం గొరిట గ్రామానికి చెందిన పావని, ఆమె తల్లి విక్రయించిన భూమికి సంబంధించిన డబ్బును బ్యాగులో ఉంచుకొని బుధవారం తిమ్మాజీపేట నుంచి హైదరాబాద్‌కు బస్సులో బయలుదేరింది. బస్సు జడ్చర్ల న్యూ బస్టాండు వద్దకు చేరుకున్న అనంతరం బ్యాగులో చూసుకోగా డబ్బు కనిపించలేదు. బ్యాగ్ జిప్పు తీసి ఉండటంతో నగదును తోటి ప్రయాణికులే చోరీ చేసి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

పోక్సో కేసులో యువకుడి రిమాండ్

గద్వాల క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) :పోక్సో కేసులో యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గద్వాల పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గద్వాల పట్టణంలోని రాతి బురుజు కాలనీకి చెందిన తరుణ్ అనే పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడు రెండు నెలల క్రితం ఓ బాలికను కిడ్నాప్ చేసి బలవంతంగా పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయంపై తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు విచారణ చేపట్టి బాలిక ఉన్న ప్రాంతాన్ని గుర్తించారు. నిందితుడు తరుణ్‌ను అరెస్ట్ చేసి బుధవారం జిల్లా కోర్టులో హాజరు పరిచారు. న్యాయాధికారి ఆదేశం మేరకు అతడిని 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ కల్యాణ్ కుమార్ తెలిపారు.




శిక్షణకు హాజరైన ఉద్యోగులు, సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ దశరథ్

ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

గద్వాల టౌన్/కేటీదొడ్డి/మానవపాడు/అయిజ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటింటి సర్వేను పట్టణంలో పకడ్బందీగా నిర్వహించాలని మునిసిపల్ కమిషనర్ దశరథ్ ఉద్యోగులకు సూచించారు. ఇంటింటి సర్వే నిర్వహణకు సంబంధించి మునిసిపల్ అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు, సర్వే సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీలకు బుధవారం పట్టణంలోని ఎంఏఎల్‌డీ కళాశాల సెమినార్ హాల్‌లో ఒక రోజు శిక్షణ తరగతి నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన కమిషనర్, మాస్టర్ ట్రైనర్లు, జిల్లా అధికారులు ఇచ్చే సూచనల ఆధారంగా సర్వేను సమర్థవంతంగా గడువులోగా పూర్తి చేయాలన్నారు. జిల్లా గణాంక శాఖ సహాయ అధికారి నాగార్జునగౌడ్ మాట్లాడుతూ కుటుంబ ఆర్థిక పరిస్థితి, కుటుంబ సభ్యులు ఉద్యోగ, ఉపాధి విషయాలు, విద్యార్హతలు, సామాజిక స్థితిగతుల గురించి సమగ్ర వివరాలను సేకరించాలన్నారు. కుటుంబంలో ఎవరైనా ప్రస్తుతం, గతంలో రాజకీయ పదవులను అనుభవించిన వారు ఉన్నట్లు గుర్తించినా వాటిని సర్వేలో పొందుపరచాలన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లు సర్వేకు సంబంధించిన వివరాలను, సేకరించే విధానాన్ని, రిపోర్టులో పొందుపరిచే అంశాల గురించి వివరించారు. మునిసిపల్ రెవెన్యూ అధికారి రాజేష్‌కుమార్ ఉన్నారు.

కేటీదొడ్డి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో కృష్ణమోహన్, మానవ పాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో భాస్కర్, అయిజ మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీడీవో వెంకటయ్య ఆధ్వర్యంలో కులగణన సర్వేపై పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై అవగాహన కల్పించారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి 3వ తేదీలోపు ఇంటింటి జాబితా సిద్ధం చేయాని, ఆరు నుంచి 18వ తేదీ లోపు ఈ సర్వే పూర్తి చేయాల్సి ఉంటుందని ఈ సందర్భంగా తెలియచేశారు. కేటీదొడ్డిలో తహశీల్దార్ షాహిదబేగం, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొనగా, అయిజలో సూపరిండెండెంట్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రవీందర్, బాలకృష్ణ, రాజేష్, లాల్‌నాయక్ పాల్గొన్నారు.

క్రియాశీల సభ్యత్వ నమోదుకు అర్హత సాధించాలి

గద్వాల అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ సభ్యత్వ నమోదులో క్రియాశీల పాత్ర పోషించిన వారందరికీ క్రియాశీల సభ్యత్వ నమోదుకు అర్హత సాధిస్తారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం డీకే బంగ్లాలో క్రియాశీల సభ్యత్వ నమోదుపై ఆయన ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ప్రతీ బూత్‌లో బూత్ అధ్యక్షులు ఆపై స్థాయి పదవులు, బీజేపీ పార్టీ తరుపున ఎన్నికల్లో పోటీ చేయడానికి క్రియాశీల సభ్యత్వం తప్పనిసరి అని అన్నారు. ఇందుకోసం ప్రతీ ఒక్కరు 100 మందికి సాధారణ సభ్యత్వం చేయించాలని దీంతో వారు అర్హత సాధిస్తారని వివరించారు. ఇందుకోసం నవంబరు 10వ తేదీ వరకు సాధారణ సభ్యత్వం చేయించడానికి అవకాశం ఉందన్నారు. 100 మంది సభ్యత్వానికి దగ్గరలో ఉన్నవారు తప్పనిసరిగా చేయిస్తే వారికి క్రియాశీల సభ్యత్వం వచ్చే అవకాశం ఉందన్నారు. వచ్చే నెల 15వ తేదీ నుంచి సంస్థాగత ఎన్నికలు ఉంటాయని మొదటి బూత్ కమిటీ, ఆ తర్వాత మండల కమిటీ, జిల్లా కమిటీల ఎన్నికలు ఉంటాయని వివరించారు. సాధ్యమైనంత త్వరగా క్రియాశీల సభ్యత్వాలు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి స్నిగ్ధారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, కేకేరెడ్డి, శివారెడ్డి, రాజగోపాల్, రాజశేఖర్‌శర్మ, దేవదాసు పాల్గొన్నారు.



క్రియాశీల సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరేందర్‌రెడ్డి

కేసీఆర్‌తోనే విద్యుత్ సంస్కరణలు సాధ్యం



సబ్‌స్టేషన్ ముందు బీఆర్ఎస్ నాయకుల నిరసన

అయిజ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కేసీఆర్‌తోనే విద్యుత్ సంస్కరణలు సాధ్యమైందని బీఆర్ఎస్ నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు కుర్వ పల్లయ్య అన్నారు. బధవారం పట్టణంలోని రాయచూర్ రహదారిలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. విద్యుత్ ధరలు పెంచి సామాన్య ప్రజల నెత్తిన మోపేందుకు సిద్ధం కాగా, బీఆర్ఎస్ అడ్డుకోవటంతో చార్జీలు పెంచకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకడుగువేసిందన్నారు. బీఆర్ఎస్ నాయకులు శివకుమార్, రంగు మద్దిలేటి, వీరేష్, కృష్ణ, మహేష్‌గౌడు, రాజు, ప్రకాష్ పాల్గొన్నారు

సాహితీ కార్యక్రమాలకు సంపూర్ణ తోడ్పాటు

గద్వాల టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సాహిత్య పరమైన కార్యక్రమాలకు గ్రంథాలయం తరపున సంపూర్ణ తోడ్పాటునందిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు అన్నారు. గద్వాల సాహితీ సంస్థ ప్రతినిధులు బుధవారం గ్రంథాలయం చైర్మన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ అంబటి భానుప్రకాష్, కార్యదర్శి అనిమూని మహేందర్ తమ సంస్థ ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాలు, ప్రచురితం చేసిన కవితలు, సాహిత్యపరమైన ముద్రణలు, ఇతరత్రా కార్యక్రమాల గురించి చైర్మన్‌కు వివరించారు. గ్రంథాలయ అభివృద్ధితో పాటు సాహితీవేత్తలను ప్రోత్సహించేందుకు తగిన రీతిలో జిల్లా గ్రంథాలయం తరపున కార్యాక్రమాలు చేపట్టాలని కోరారు. సాహితీ సంస్థ సభ్యులు మేడిచర్ల హరినాగభూషణం, పూదత్తు భాస్కర్, డాక్టర్ మంగళగిరి శ్రీనివాసులు, నాయుడుగారి జయన్న, మహేష్, రాజేష్, గ్రంథాలయ అధికారి రామాంజనేయులు ఉన్నారు.

మరిన్ని పుస్తకాలు అందుబాటులోకి తెస్తాం

మానవపాడు : గ్రంథాలయాల్లో పాఠకులకు మరిన్ని పుస్తకాలు అందుబాటులోకి తీసుకువస్తామని జిల్లా గ్రంథాలయ చెర్మన్ నీలి శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది గోకారి, కాంగ్రెస్ నాయకులు ప్రసాద్, మనోహర్ బాబు ఉన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

గద్వాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మాదద్రవ్యాలతో జీవితాలు నాశనం అవుతున్నాయని వాటిని దరిచేరనీయకండని ఎంపీడీవో ఆంజనేయులు విద్యార్థులకు సూచించారు. బుధవారం మల్దకల్ మండల కేంద్రంలో విద్యార్థులతో సమావేశం నిర్వహిం చి మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. విద్యార్థులు పాఠశాల, కళాశాలలో మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నట్లు గుర్తించిందని పాఠశాల, కళాశాలలో డ్రగ్స్ నిర్మూళన కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించిదన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడకుండా చూడటం, విద్యాలయాలలోకి డ్రగ్స్ రాకుండా అరికట్టడం, అలవాటు పడిన విద్యార్థులకు గుర్తించి అప్రమత్తం చేస్తామన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీస్‌ల నుంచి ఒక్కొక్కరితో కమిటీని వేస్తామన్నారు. హెచ్ఎం సురేష్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ సుజాతమ్మ, కానిస్టేబుల్ గోపాల్‌నాయక్, సూర్యప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా క్రీడల్లో మెరిసిన విద్యార్థులు

అలంపూర్ చౌరస్తా, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఉండవల్లి మండలం పుల్లూరు ఎంజేపీ విద్యార్థినులు క్రీడల్లో సత్తాచాటారు. కల్వకుర్తి పట్టణంలో ఈనెల 27 నుంచి జరిగిన ది స్పోర్ట్ పోటీల్లో అండర్ 14, అండర్ 19 పాఠశాల, కళాశాల విభాగాల్లో పుల్లూరు మహాత్మజ్యోతిరావు పూలే గురుకుల విద్యార్థినులు పాల్గొన్నారు. అండర్ 19 విభాగంలో ఖోఖో పోటీల్లో పాఠశాలకు చెందిన ఎల్.శ్రీవాణి, కె.కల్పన, ఎం.మమత, కె.గాయత్రి, సి.పూజిత, బి.అమ్ములు, వీకే. తేజశ్వరీ డి.ప్రియాంక మొదటి స్థానంలో నిలిచారు. సీనియర్ అథ్లెటిక్స్ అండర్ 19 విభాగంలో 400 మీటర్లు, కె.గాయత్రి గోల్డ్ మెడల్, 800 మీటర్ల 3కె రన్‌లో కె.గాయత్రి సిల్వర్ మెడల్, 15 కె.రన్‌లో బీ.స్రవంతి బ్రాంజ్ మెడల్ సాధించారు. వాలీబాల్ అండర్ 14 విభాగంలో ఎం.స్రవంతి, కె.సాయిలిఖిత, పి.షమీనా, జి.సాయిప్రియ, జి.వైష్ణవి, బి.అనూష, కె.మౌనిక జిల్లా స్థాయిలో రెండో బహుమతి సాధించారు. ఇందులో ఉమ్మడి జిల్లా స్థాయి నుంచి వాలీబాల్ అండర్ 14లో జి.సాయిప్రియ, ఎం.సమంత, బి.అనూష, బి.కళావతి (కబడ్డీ), ఎం.సానియ, కె.భారతి, పీఎస్ భారతి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. అండర్ 19లో ఎం.మమత (ఖోఖో), కె.గాయత్రి, ఏ.వాణి, బి.కృష్ణవేణి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అథ్లెటిక్స్ పోటీలలో కె.స్రవంతితో పాటు మరో 13 మంది రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దేవానందం తెలిపారు. ఇందుకు పీఈటీ రాధను అభినందించారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ దేవానందం

ఉత్సాహంగా ముందస్తు దీపావళి వేడుక



పట్టణంలోని ప్రగతి పాఠశాలలో దీపాలు వెలిగిస్తున్న బాలికలు

గద్వాల టౌన్/అయిజ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ప్రగతి విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు బుధవారం ముందస్తుగా దీపావళి పండుగను నిర్వహించుకున్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి వచ్చిన బాలికలు నరకాసురిడి వధతో సిద్ధించిన వెలుగుకు చిహ్నంగా దీపాలు వెలిగించారు. అదే విధంగా భారత తొలి హోంశాఖ మంత్రి, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని బాలురు దివంగత నాయకుడి వేషధారణలో అలరించారు.

- అయిజలో దీపావళి సందడి నెలకొంది. గురువారం దీపావళి పర్వదినం కావటంతో కొనుగోళ్లతో దుకాణాలు, జనాలతో రహదారులు కిటకిటలాడాయి. పాతబస్టాండు, అంబేడ్కర్ చౌక్, కొత్తబస్టాండు, కర్నూల్ చౌరస్తా ప్రధాన రహదారులలో రద్దీ నెలకొంది. పాఠశాలలకు సెలవులు ఉన్న నేపథ్యంలో బీజీఆర్, అక్షర. శ్రీచైతన్య, లయోల, కృష్ణవేణి పాఠశాలలో విద్యార్థులతో కలిసి ముందస్తు దీపావళి సంబురాలు జరుపుకున్నారు.



దీపావళి ఆంగ్లం అక్షరాలతో బీజీఆర్ పాఠశాల విద్యార్థినులు

బాలిక మృతిపై దర్యాప్తు జరిపించాలి

గద్వాల టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : బాలిక మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. బాలిక మృతదేహానికి రీ పోస్టుమార్టం నిర్వహించి వాస్తవాలను బయటపెట్టాలన్నారు. పట్టణంలోని సమితి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మృతికి కారకులైన నిందితులను అరెస్టు చేయాలని, ఈ సంఘటనపై ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ స్పందించకపోవడం బాధ్యతా రాహిత్యమన్నారు. వాస్తవా లను వెలికి తీసేందుకు రీ పోస్టుమార్టం నిర్వహించాల న్నారు. నిందితులను అరెస్టు చేసే వరకు జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. పోరాట సమితి కన్వీనర్ బుచ్చిబాబు, రంగస్వామి, వెంకట్రాములు, ప్రేమరాజ్, గోపాల్ ఉన్నారు.



మాట్లాడుతున్న నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్

బాలిక మృతికి కారుకులను అరెస్ట్ చేయాలి

వడ్డేపల్లి : బాలికల బలవన్మరణానికి కారకులైన సీడ్ ఆర్గనైజర్‌ను అరెస్టు చేయాలని ఎంఎస్పీ జిల్లా కన్వీనర్, ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఐజ రాజు డిమాండ్ చేశారు. బుధవారం శాంతినగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు భీమన్న మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మస్తాన్ మాదిగ, వడ్డేపల్లి మండల నాయకుడు ఏసేపు మాదిగ, ఎంఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు రాజశేఖర్, దేవరాజు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల నివాళి

అయిజ : బాలిక మృతికి అఖిలపక్ష కమిటీ సభ్యులు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ముందు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. అఖిలపక్ష కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, సభ్యులు వెంకట్రాములు, పల్లయ్య, అంజి, మల్లికార్జున్, రాజు, మారెప్పలు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడలు వాయిదా

గట్టు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల స్థాయిలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న సీఎం కప్ పోటీలు వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో చెన్నయ్య బుధవారం తెలిపారు. పోటీల తేదీని తదుపరి ప్రకటిస్తామన్నారు.

పోలీసుల ముమ్మర తనిఖీ

అయిజ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పబ్లిక్ ప్రాంతాల్లో బుధవారం తెల్లవారుజామున అయిజ ఎస్ఐ విజయ్‌భాస్కర్ ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని తిక్కవీరేశ్వరస్వామి, ప్రభుత్వ పాఠశాల, మునిసిపాలిటీ కార్యాలయాలతో పాటు వాహనాలను సైతం తనికీ చేశారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కమిషనర్‌కు ఘన సన్మానం

వడ్డేపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : వడ్డేపల్లి మునిసిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రాజయ్యను కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలోని కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ సుజాతమ్మ, నాయకులు శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

రైస్ మిల్లర్స్ సమస్యల పరిష్కారానికి కృషి

గద్వాల న్యూటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రైస్ మిల్లర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రా రైస్ మిల్లర్స్ రాష్ట్ర అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఆలూరి రామ్మోహన్ అన్నారు. రా రైస్ మిల్లర్స్ రాష్ట్ర అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా ఆలూరి రామ్మోహన్‌ను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గణపతిరెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో నియామక పత్రాన్ని అందించారు. జిల్లా కేంద్రంలో బుధవారం రామ్మోహన్‌ను రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు అభినందించారు.

ఉపాధి హామీ పనులపై ఆడిట్

గట్టు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : గట్టు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై సోషల్ ఆడిట్ నివేదికలను ప్రజావేదికలో బహిరంగ పర్చారు. ఈ కార్యక్రమానికి డీఆర్డీవో పీడీ అదనపు కలెక్టర్ నరసింగరావు ముఖ్య అతిథిగా హాజరుకాగా, మొత్తం 12 మంది వీఎస్ఏలు, ఇద్దరు డీఆర్పీలు, ఒక ఎస్సార్పీ గ్రామాల్లో గత సంవత్సరం ఏప్రిల్ నుంచి ఈ సంవత్సరం మార్చి వరకు జరిగిన పనులపై ఆడిట్ నిర్వహించారు. మొత్తం రూ.2.67 కోట్ల పనులకు సంబంధించి ప్రజావేదిక కార్యక్రమం రాత్రి పొద్దుపోయే వరకు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చెన్నయ్య, ఏపీవో పాగుంట స్వామి, వీఏవో శ్రీనివాసులు, ఎస్సార్పీ బాలునాయక్ పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ధరూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తుందని మాజీ వైఎస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ర్యాలంపాడు గ్రామంలోని నెట్టెంపాడు ఎత్తిపోతల ఫేస్-2, ర్యాలంపాడు ప్రాజెక్టులో 8.68 లక్షల చేప పిల్లలను వదిలారు. ఏడీ, ఏఈఈ వెంకట్రామిరెడ్డి, జేఈ గణేష్, మాజీ సర్పంచు తిమ్మప్ప, మత్స్యకార సంఘం నాయకులు నర్సింహులు, గోవిందు, చిన్న నర్సిహులుగౌడ్, నర్సింహులు, రాముడు ఉన్నారు.

మూడు ఇసుక వాహనాలు పట్టివేత

ఎర్రవల్లి/ధరూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎర్రవల్లి మండలం ఇటిక్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి ఇసుక టిప్పర్, ట్రాక్టర్‌ను ఇటిక్యాల పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకటేష్ కథనం ప్రకారం బీచుపల్లి నుంచి ఎర్రవల్లికి అక్రమంగా తరలిస్తున్న, ట్రాక్టర్‌తో పాటు పరిమితికి మించిన ఓవర్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసామని, టిప్పర్‌ను మైనింగ్ శాఖ అధికారులకు అప్పజెప్పినట్లు తెలిపారు. అదే విధంగా ధరూర్ మండలం మన్నిపురం వాగు నుంచి ఇసుకను నింపుకుని గద్వాలకు తరలిస్తుండగా డ్యాం సమీపంలో జీరో పాయింట్ వద్ద ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్ రామకృష్ణ రెడ్డిపై కేసు నమోదు చేశామని ధరూర్ ఎస్ఐ అబ్దుల్ షుకూర్ తెలిపారు.

వరద బాధితులకు మౌలిక వసతులు కల్పించాలి

అలంపూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : 2009 వరదలో నీటిలో ముంపునకు గురైన వారికి ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. అలంపూరు పట్టణ కేంద్రంలోని వారాహి జిల్లా అధికార ప్రతినిధి గొంగళ్ల ఈశ్వర్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2009 వరదలు వచ్చి అలంపూరు మొత్తం నీటి ముంపునకు గురై దాదాపు 15 సంవత్సరాలు పూర్తయినా గత ప్రభుత్వ వైఖరి వల్ల నేటి వరకు కూడా వరద బాధితులకు ఇళ్ల స్థలాలు, మౌలిక వసతులు గాని ఏర్పాటు చేయలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వరద బాధితులపై దృష్టి పెట్టి వారికి వసతులు ఏర్పాటు చేయాలని, లేకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. అలంపూరు రాజగోపాల్, రాష్ట్ర బీజేవైఎం ఉపాధ్యక్షుడు రాజశేఖర్ శర్మ, రాష్ట్ర ఓబీసీ ప్రోగ్రాం కో కన్వీనర్ నాగమల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేశ్వర్‌రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు మధురవాణి, మండల అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రంగస్వామి పాల్గొన్నారు.